క్లుప్తంగా

సౌత్‌జోన్‌ కరాటేలో ధర్మవరం విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం మేరి వరకుమారి, జూడో కోచ్‌ ఇనాయత్‌బాషా

ధర్మవరం అర్బన్‌: 4వ ఖేలో ఇండియా జూడో సౌత్‌జోన్‌ కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థిని ప్రతిభ చూపినట్లు జూడో కోచ్‌ ఇనాయత్‌బాషా తెలిపారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్‌ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని యువ సంధ్యాను పాఠశాల హెచ్‌ఎం మేరి వరకుమారి అభినందించారు. ఈనెల 9 నుంచి 13 వరకు చెన్నైలోని జవహర్‌లాల్‌ నెహ్రూ ఇండోర్‌ స్టేడియంలో జరిగిన 4వ ఖేలో ఇండియా జూడో సౌత్‌జోన్‌ కరాటే పోటీల్లో సబ్‌ జూనియర్‌ కేటగిరిలో 8వ తరగతి చదువుతున్న యువ సంధ్యా 28 కేజీల విభాగంలో వెండి పతకంతోపాటు రూ.3వేలు నగదు బహుమతి సాధించిందన్నారు. విద్యార్థిని భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు.

దాతల సహకారంతో భోజన వసతి



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న వేణుగోపాల్‌, ప్రిన్సిపాల్‌ లక్ష్మీకాంత్‌రెడ్డి

ధర్మవరం: దాతల సహకారంతో విద్యార్థినులకు భోజన వసతి కల్పించామని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల ప్రిన్సిపల్‌ లక్ష్మీకాంత్‌రెడ్డి, కళాశాల చైర్మన్‌ బండి వేణుగోపాల్‌ తెలిపారు. ఏటా దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా వారు 450 మంది విద్యార్థినులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడిగా బీరే శ్రీనివాసులు



ధర్మవరం: ఆల్‌ ఇండియా స్టూడెంట్‌ ఆర్గనైజేషన్‌(ఏఐఎస్‌ఓ) జిల్లా అధ్యక్షుడుగా బీరే శ్రీనివాసులు, కార్యదర్శిగా పల్లా నవీన్‌కుమార్‌ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర సభ్యుడు నిరంజన్‌యాదవ్‌ ఉత్తర్వులు అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లాలోని విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, ప్రతి మండలంలో సంఘాన్ని బలోపేతం చేస్తామని వారు పేర్కొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ దినోత్సవం జరుపుకుంటున్న దృశ్యం

కదిరి అర్బన్‌: ఎరుకులవాండ్లపల్లిలో ఉన్న హరీష్‌ పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ కవులైన కబీర్‌దాస్‌, తులసీదాస్‌, మీరాబాయ్‌, ప్రేమ్‌ చంద్‌ రచనలు, పద్యాల సందేశాన్ని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ ఎంఎంఎస్‌ కిరణ్‌, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



తాడిమర్రిలో డ్రైనేజీలో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లుతున్న దృశ్యం

తాడిమర్రి: దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే పురస్కరించుకుని తాడిమర్రి, నార్శింపల్లి, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, దాడితోట, కునుకుంట్ల, చిన్నచిగుళ్ళరేవు, పిన్నదరి, చిల్లవారిపల్లిలో వైద్య సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామాల్లోని వీధుల్లో పర్యటిస్తూ మురుగు నీటి గుంతలు, డ్రైనేజీల్లో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లించారు. అలాగే నీటి తొట్టెలు, పాతటైర్లు, చిప్పలు తదితర వాటిల్లో ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం వారు గ్రామస్తులతో మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఏఎన్‌ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, సావిత్రమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌, రంగనాయకులు పాల్గొన్నారు.

మెడికల్‌ కాలేజీల ప్రైవేటీకరణతో పేదలకు నష్టం



ప్రభుత్వం మెడికల్‌ కాలేజీలను ప్రైవేట్‌ వారికి అప్పజెప్పడం వల్ల పేద విద్యార్థులు ఎంతగానో నష్టపోతారు. విద్యార్థులు మంచి ర్యాంకు సాధిస్తే ప్రభుత్వ మెడికల్‌ కాలేజీల్లో ఉచితంగా చదివే అవకాశం ఇంత వరకు ఉండేది. అలాకాకుండా మెడికల్‌ కాలేజీలను ప్రైవేట్‌ వారికి అప్పజెప్పడం ద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావాల్సి వస్తుంది. మెడికల్‌ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి.

–చాంద్‌బాషా, విద్యావేత్త, ధర్మవరం.



మెడికల్‌ కాలేజీలను ప్రభుత్వమే నడపాలి



మెడికల్‌ కాలేజీలను ప్రైవేటీకరిస్తే పేదలకు వైద్య విద్య అందని ద్రాక్షే అవుతుంది. మా అమ్మాయి గతంలో నీట్‌ పరీక్ష రాసి మంచి ర్యాంకు సాధించడం ద్వారా ఎంబీబీఎస్‌ చదివే అవకాశం వచ్చింది. ఖర్చు కూడా నామమాత్రంగానే అవుతోంది. గత ప్రభుత్వం మెడికల్‌ కాలేజీలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపడం వల్లనే ఇది సాధ్యమైంది.

–బడన్నపల్లి కేశవరెడ్డి, ధర్మవరం.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



నల్లచెరువులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ మీనాక్షి



కబడ్డీలో తలపడుతున్న గాండ్లపెంట, కస్తూర్బా పాఠశాల బాలికల జట్లు

నల్లచెరువు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈఓ మీనాక్షి సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. డీఈఓ, ఎంఈఓ తిరుపాల్‌ నాయక్‌ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధారుడ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్‌–14, 17 బాల, బాలికలకు విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. ఎస్‌జీఎఫ్‌ కో ఆర్డినేటర్‌ షఫి, ఉపాధ్యాయులు శ్రీనాథ్‌రెడ్డి, గౌస్‌పీర్‌, సుభహాన్‌, హరి, సుజాత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్‌ ఆధ్వర్యంలో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. గాండ్లపెంట, రెక్కమాను, కటారుపల్లి, కేజీబీవీ పాఠశాలల నుంచి అండర్‌–14, 17 విభాగాల్లో 200 మంది బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, అథ్లెటిక్స్‌, యోగా, చెస్‌ పోటీలను నిర్వహించారు. కబడ్డీ బాలికల విభాగంలో గాండ్లపెంట, ఖోఖో బాలికలు, బాలుర విభాగంలో కటారుపల్లి, రెక్కమాను ఉన్నత పాఠశాలలు, వాలీబాల్‌ విభాగంలో గాండ్లపెంట ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఎస్‌జీఎఫ్‌ మండల కోఆర్డినేటర్‌ , పీడీ హరిప్రసాద్‌, పీడీలు పాపారాయుడు, హారున్‌, ఆనందరెడ్డి, అహల్య, ఉపాధ్యాయులు ముంతాజ్‌అలీ, గంగాధర, చిన్నప్పయ్య పాల్గొన్నారు.

బత్తలపల్లి: విద్యార్థులు విద్యతోపాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌జీఎఫ్‌ మండల కోఆర్డినేటర్‌ టి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్‌–14, అండర్‌–17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్‌, చెస్‌, అథ్లెటిక్స్‌ మొదలైన క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు రామాపురం పాఠశాలలోని సోషల్‌ టీచర్‌ గంగిరెడ్డి మెడల్స్‌ అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీరాములు, మహమ్మద్‌జాన్‌, రవీంద్ర, నాగమల్లేసు, వ్యాయామ ఉపాధ్యాయులు సువర్ణ, లాల్‌బాషా, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం రామాంజులుయాదవ్‌ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్‌ ఆధ్వర్యంలో జరిగిన క్రీడాపోటీలను ప్రారంభించారు. అండర్‌–16, 17 విభాగాల్లో మండలంలోని 4 హైస్కూళ్లు, కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, చెస్‌, వాలీబాల్‌, యోగా, టెన్నికాయిట్‌, అథ్లెటిక్స్‌ పోటీలు నిర్వహించారు. పీడీలు సందీప్‌, ప్రసాద్‌, అశ్వని, సుహాసిని పాల్గొన్నారు.

నల్లమాడ: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీలు ముగిశాయి. శుక్రవారం అండర్‌–14, అండర్‌–17 విభాగంలో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, పరుగు పందెం, చెస్‌, బ్యాడ్మింటన్‌ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు త్వరలో జరగబోయే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం లీలారాణి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్‌: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 19 నుంచి 21వ తేదీవరకు స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటాచలం శుక్రవారం తెలిపారు. 19న అండర్‌ –14,17 బాలికలకు, 20న బాలురకు ఖోఖో, వాలీబాల్‌, షటిల్‌, కబడ్డీ, చెస్‌, 21న బాలబాలికలకు స్థానిక ఎస్టీఎస్‌ఎన్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్‌ పోటీలు ఉంటాయన్నారు. కదిరి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్‌, కేజీబీవీ, ఏపీటీడబ్ల్యూ రెసిడెన్షియల్‌ స్కూల్‌ విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

ముదిగుబ్బ: స్థానిక బాలుర హైస్కూల్‌లో శుక్రవారం ఎస్‌జీఎఫ్‌ ఆధ్వర్యంలో యోగా, త్రోబాల్‌, కబడ్డీ, వాలీబాల్‌ పోటీలు నిర్వహించారు. ముదిగుబ్బ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎనుములవారిపల్లి, కొడవండ్లపల్లి, మల్లేపల్లి, ఉప్పలపాడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈఓ రమణప్ప, ప్రధానోపాధ్యాయులు రాఘవ, రమాదేవి, ఎస్‌జీఎఫ్‌ మండల కోఆర్డినేటర్‌ రాజశేఖర్‌, పీఈటీలు రేఖ, కాంత లింగం, రజనీకాంత్‌, శిల్ప, జ్యోతి యాదవ్‌, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్‌: ధర్మవరం బాలుర హైస్కూల్‌లో శుక్రవారం స్కూల్‌ గేమ్స్‌ పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్‌ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ నాగేంద్ర, మండల కోఆర్డినేటర్‌ రఘునాథరావు, పీఈటీలు ప్రతాప్‌రెడ్డి, నారాయణస్వామి, సరళ, పద్మ, మల్లేష, అశోక్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు

కదిరి అర్బన్‌: స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో రీజనల్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఆఫీసర్‌(ఆర్టీఓ)గా జే శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం డీటీసీ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. కాగా కదిరి తొలి ఆర్టీఓ కూడా ఈయనే. ఈయన స్వగ్రామం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామం.

15లోపు ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలి

అమడగూరు: మండలంలో ఖరీఫ్‌ కింద పంటలు సాగు చేసిన రైతులు ఆదివారంలోపు ఈ–కేవైసీ పూర్తి చేయించుకోవాలని ఏఓ వెంకటరమణాచారి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్‌ బుకింగ్‌ చేయించుకున్న రైతులందరూ ఆర్‌ఎస్‌కే సిబ్బందితో సంప్రదించి ఆదివారంలోగా ఈ–కేవైసీ పూర్తి చేయించుకోవాలన్నారు. తర్వాత ఈ–కేవైసీ చేసుకున్నా ప్రయోజనం ఉండదన్నారు.

జగన్‌ను కలిసిన యువజన నాయకుడు



వైఎస్‌ జగన్‌తో రాజశేఖర్‌నాయుడు

నల్లమాడ: గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి, దొన్నికోటకు చెందిన రాజశేఖర్‌నాయుడు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ఈ సందర్భంగా జగన్‌ను కోరినట్లు రాజశేఖర్‌నాయుడు తెలిపారు.

ప్లాస్టిక్‌ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు



ఇడ్లీ పాత్రను పరిశీలిస్తున్న కమిషనర్‌ ప్రహ్లాద

పుట్టపర్తి టౌన్‌: నిషేధిత ప్లాస్టిక్‌ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవని కమిషనర్‌ ప్రహ్లాద హోటల్‌, ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్ల యజమానులను హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్లను సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు అధిసంఖ్యలో వస్తుంటారని, స్వచ్ఛ పుట్టపర్తిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ దుకాణం, ఇంటిలోని వ్యర్థ పదార్థాలను రోడ్లపై పారవేయకుండా చెత్తబుట్టల్లో వేయాలన్నారు. హోటళ్లు, ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్‌లో ఇడ్లీల తయారీ, ఆహార పదార్థాలను పార్శిల్‌ చేసేందుకు ప్లాస్టిక్‌ కవర్లు వినియోగిస్తున్నారన్నారు. వేడికి ప్లాస్టిక్‌ కరిగి ప్రజారోగ్యానికి హాని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో శానిటేషన్‌ అధికారి నటరాజ్‌, సెక్రటరీ మోహన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ధర్మవరం అర్బన్‌: దివంగత సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం జిల్లా నాయకులు ఎస్‌హెచ్‌బాషా, కార్యదర్శి ఆలకుంట మారుతి, సీఐటీయూ మండల కన్వీనర్‌ జేవీ రమణ, కోకన్వీనర్లు ఆయుబ్‌ఖాన్‌, ఆదినారాయణ మాట్లాడుతూ సీతారాం ఏచూరి 1974లో విద్యార్థి దశలో ఉద్యమంలోకి అడుగిడి ఐదు దశాబ్దాల పాటు పోరుబాటలో నడిచారన్నారు. రాజ్యసభ సభ్యునిగా ప్రజల సమస్యలను రాజ్యసభలో చర్చించి ప్రజలు, కార్మికుల పక్షాన నిలిచిన పోరాట యోధుడన్నారు. మూడు పర్యాయాలు సీపీఎం పార్టీ జాతీయ కార్యదర్శిగా సేవలు అందించారన్నారు. చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, హరి, అంగన్‌వాడీ వర్కర్స్‌ నాయకురాలు చంద్రకళ, దీన, వనజ, అరుణ, స్వర్ణలత, వసుధాంజలి, మున్సిపల్‌ కార్మిక సంఘం నాయకులు బాబు, ముకుంద, లక్ష్మీ ఓబులేసు, టాటాఏస్‌ యూనియన్‌ నాయకులు సుబ్రహ్మణ్యం, కుళ్లాయప్ప, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్‌: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరనిలోటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్‌ వెంకటేష్‌ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈసందర్భంగా ఆయన సీతారాం ఏచూరి చేసిన పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు సాకే వెంకటేష్‌, బాబా ఫక్రోద్దీన్‌, సిద్దూ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

అమడగూరు: కుటాగుళ్ల 132–33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో కదిరి డివిజన్‌ పరిధిలోని కదిరి, అమడగూరు, తలుపుల, గాండ్లపెంట, ముదిగుబ్బ, ఎన్‌పీకుంట, నల్లమాడ, ఓడీచెరువు మండలాలకు శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌ అధికారులు తెలిపారు. మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్‌ కౌసల్యసాయి

పుట్టపర్తి: అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లీబిడ్డలకు అందించే పౌష్టికాహారంపై ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ కౌసల్యసాయి అవగాహన కల్పించారు. ఆమె శుక్రవారం బుక్కపట్నం మండలం పాముదుర్తి, రాశింపల్లిలో సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, నవజాతా శిశువులకు ఆరోగ్యవంతమైన పోషక విలువలు కలిగిన పదార్థాలందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోషకాలతో సంపూర్ణ ఆరోగ్యం

కనగానపల్లి: మంచి పోషకాలు విలువలు కలిగిన ఆకుకూరలు, పండ్లు, గుడ్లు తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో సమావేశం ఏర్పాటు చేశారు. పోషకాహారాలు, ఆరోగ్య సూత్రాలపై ఐసీడీఎస్‌ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఓడీచెరువు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్‌ విజయకుమారి అన్నారు. బుచ్చిరాజుగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పౌష్టికాహార ప్రాధానత్యను తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, రత్నమ్మ, భారతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు .

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కదిరి అర్బన్‌: ఈ నెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు కదిరి ఆర్టీసీ డిపో నుంచి 17న ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్‌ డీఎం హరిత శుక్రవారం తెలిపారు. బస్సులు ఉదయం 9 గంటలకు బస్టాండ్‌ నుంచి బయలుదేరుతాయన్నారు. కాణిపాకం, కంచి గోల్డెన్‌ టెంపుల్‌ను దర్శించుకుని అరుణాచలం వెళ్తాయన్నారు. నల్లచెరువు, తనకల్లు, ములకలచెరువు, అంగళ్లలో బోర్డింగ్‌ పాయింట్‌ సౌకర్యం ఉందన్నారు. 35 నుంచి 40 మంది భక్తులు ఒకే గ్రామానికి చెందిన వారైతే ఆ గ్రామానికే బస్సు పంపిస్తామని పేర్కొన్నారు. సూపర్‌లగ్జరీకి రూ.1,300, ఎక్స్‌ప్రెస్‌కు రూ.1050 చార్జీ ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌, ఫోన్‌ పేతో కూడా టికెట్‌ పొందొచ్చన్నారు. వివరాలకు 9959225892,9052537054 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రుణాలు రెన్యూవల్‌ చేయాలి

కనగానపల్లి: వర్షాభావ పరిస్థితులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితులను గుర్తించి పంటల సాగుకు తీసుకున్న బంగారు రుణాలను వడ్డీతోనే రెన్యూవల్‌ చేసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు స్టేట్‌బ్యాంక్‌ అధికారులను కోరారు. దీనిపై శుక్రవారం రైతు సంఘం నాయకులు మహాదేవ, బాలరాజు, నాగరాజు స్థానిక బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

వరద బాధితులకు జానపద కళాకారుల చేయూత



బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న జానపద కళాకారులు

ధర్మవరం రూరల్‌: విజయవాడ వరద బాధితులకు సుబ్బారావుపేట జానపద యువ కళాకారుల సంఘం చేయూత నిచ్చింది. ఇందులో భాగంగా కళాకారుల సంఘం నేతలు విజయవాడలో బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానపద యువ కళాకారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరెడ్డి మాట్లాడుతు తమ సంఘం తరపున 20 మంది సభ్యులు రెండు రోజులుగా బాధితులకు నిత్యావసరాలను అందించామన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఐఆర్‌ కోసం ఎంత కాలం ఎదురుచూడాలి?’



ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయులు

ఎన్‌పీకుంట: ఐఆర్‌ కోసం ఉద్యోగులు ఎంత కాలం ఎదురుచూడాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికీ 30 శాతం మధ్యంతర భృతిని, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం నియమించిన 12వ పీఆర్‌సీ కమిషన్‌ రాజీనామా చేసినందున వెంటనే పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాన్నారు. నిర్ణీత కాలపరిమితి లోపు నివేదికలు తెప్పించుకొని వీలైనంత త్వరగా 12వ పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. ఇప్పటికే ఏడాది ఆలస్యమైందని, ఈ విధంగా ప్రతి పీఆర్‌సీ అమలు ఆలస్యం అవుతున్నందున ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 11వ పీఆర్‌సీ అమలులో జరిగిన నష్టాన్ని, లోపాలను సరిదిద్ది ఈ పీఆర్‌సీలో న్యాయం చేస్తారని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ఎదురు చూస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌, డిఏ, ఏపీజీఎల్‌ఐ, ఆర్జిత సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. పాఠశాలలో వివిధ రకాల యాప్‌లను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయినులకు ఎంటీఎస్‌ అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఎస్టీయూ నాయకులు రామాంజులుయాదవ్‌, రమణానాయక్‌ పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోండి



నరసింగరాయనిపల్లిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నరసింగరాయనిపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్‌ఎస్‌ గేట్‌ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్‌ రవినాయక్‌ ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి సమయంలో దోమకాటుకు గురికాకుండా ఉండాలంటే తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు. లేకపోతే వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద డ్రమ్ములు, తొట్టెల్లో నీటిని నిల్వ చేసుకోరాదన్నారు. ఇలా చేయడం వల్ల అందులో దోమల లార్వా పెరుగుతుందన్నారు. జ్వరం సోకితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. అనంతరం వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిలీల, హెల్త్‌ అసిస్టెంట్‌ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం సుభాషిణి, ప్రమీల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌ బుకింగ్‌ తప్పనిసరి



వేరుశనగ పంటలో ఈ క్రాప్‌ బుకింగ్‌ చేస్తున్న ఏఓ ఉదయ్‌కుమార్‌

చెన్నేకొత్తపల్లి: రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్‌ బుకింగ్‌ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్‌ సూచించారు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలో రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామ పంచాయతీల్లోని ఆర్బీకే సిబ్బంది పంట పొలాల్లోకి వచ్చి సాగు చేసిన పంట వివరాలను నమోదు చేస్తారన్నారు. ఈ–క్రాప్‌ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్స్‌, ఇతర పంట నష్ట పరిహారం అందుతాయని పేర్కొన్నారు. ఈ–క్రాపింగ్‌ చేయించుకునే రైతులు పట్టాదారు పాస్‌ బుక్కు, ఆధార్‌కార్డు తీసుకెళ్ళాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు నిర్ణీత సమయంలోపు ఈ క్రాపింగ్‌ చేయించుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



మేడాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మల్లికార్జున

చెన్నేకొత్తపల్లి: పాఠశాల తరగతి గదులు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేడాపురం ఉన్నత పాఠశాల, బసంపల్లి గ్రామ పరిసరాలను సందర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం బసంపల్లి గ్రామ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రహదారి పక్కన ఉన్న చెత్త, దిబ్బలను వెంటనే తొలగించాలన్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ గంగావతి, ఆర్‌డబ్ల్యుయస్‌ జేఈ లక్ష్మీనారాయణ,ఈవోఆర్డీ అశోక్‌నాయక్‌, పాఠశాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.